# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 13వ అధ్యాయము

## ప్రేమ అన్నిటికంటె శ్రేష్ఠమైనది

మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేని వాడనైతే మ్రోగెడు కంచును గణగణ లాడు తాళమునై యుందును. 2 ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు జ్ఞానమంతయు యెరిగిన వాడనైనను, కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసము గలవాడనైనను, ప్రేమలేని వాడనైతే నేను వ్యర్థుడను. 3 బీదల పోషణ కొరకు నా ఆస్తినంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమ లేనివాడనైతే నాకు ప్రయోజన మేమియు లేదు. 4 ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు. ప్రేమ డంబముగా ప్రవర్తించదు అది ఉప్పొంగదు. 5 అమర్యాదగా నడువదు స్వప్రయోజనమును విచారించుకొనదు త్వరగా కోపపడదు. అపకారమును మనస్సులో ఉంచుకొనదు. 6 దుర్నీతి విషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. 7 అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును అన్నిటిని నిరీక్షించును అన్నిటిని ఓర్చును. 8 ప్రేమ శాశ్వత కాలముండును. ప్రవచనములైనను నిరర్థకములగును భాషలైనను నిలిచిపోవును జ్ఞానమైనను నిరర్థకమగును. 9 మనము కొంతమట్టుకు ఎరుగుదుము. కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని, 10 పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణము కానిది నిరర్థకమగును. 11 నేను పిల్లవాడనై యున్నప్పుడు పిల్లవానివలె మాటలాడితిని, పిల్లవానివలె తలంచితిని, పిల్లవానివలె యోచించితిని, ఇప్పుడు పెద్దవాడనై పిల్లవాని చేష్టలు మానివేసితిని. 12 ఇప్పుడు అద్దములో చూచినట్టు సూచనగా చూచుచున్నాము. అప్పుడు ముఖాముఖిగా చూతుము. ఇప్పుడు కొంతమట్టుకే ఎరిగియున్నాను అప్పుడు నేను పూర్తిగా ఎరుగబడిన ప్రకారము పూర్తిగా ఎరుగుదును. 13 కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఈ మూడును నిలుచును. వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే.